క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న అక్కరమాని విజయనిర్మల

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు బానోజీనగర్‌లో రూ.17.50 లక్షల నిధులతో యూజీడీ పనులకు బుధవారం వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడి కష్టం తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తలపెట్టారన్నారు. ఆ కార్యక్రమంలో భాగంగా తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ యూజీడీ పనులను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థికి సత్కారం



భరత్‌ను అభినందిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

ఎంవీపీకాలనీ: జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొన్న సమత కళాశాల విద్యార్థి ఎ.భరత్‌ను ఆ కళాశాల యాజమాన్యం అభినందించింది. సమత కళాశాలలో బీసీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న భరత్ ఇటీవల కర్ణాటకలో జరిగిన ఉత్సవాల్లో ప్రదర్శనకు ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ సెంటర్ తరఫున ఎంపికయ్యారు. దీంతో ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు ఈ వేడుకల్లో పాల్గొని మెడల్‌తో పాటు ధ్రువపత్రం అందుకున్నాడు. ఈ నేపథ్యంలో కళాశాల యాజమాన్యం భరత్‌ను సత్కరించింది.

అంగన్‌వాడీ కేంద్రానికి వితరణ



స్టీల్ ప్లేట్లు, ఫ్యాన్లు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఎంవీపీ కాలనీ: పెదజాలరిపేటలోని అంగన్‌వాడీ కేంద్రానికి రోటరీ క్లబ్ విశాఖ స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో బుధవారం 20 స్టీల్ ప్లేట్లు, 2 ఫ్యాన్లు అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఈ సాయం అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటేరియన్ రవికుమార్, అంగన్‌వాడి సెంటర్ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

స్వీయ కథా పఠనం



కథా పఠనం చేస్తున్న రచయిత భాగవతుల సత్యనారాయణమూర్తి

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం స్వీయ కథా పఠనం సాహిత్య కార్యక్రమం జరిగింది. విభిన్న సామాజిక అంశాలపై రచయితలు తమ స్వీయ కథలను చదివి వినిపించారు. సభాధ్యక్షత వహించిన సిహెచ్.చిన సూర్యనారాయణ, ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు కథానిక అమృత హస్తంను విశ్లేషించారు. ప్రముఖ రచయిత మేడా మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ కథల్లో ప్రధానమైనవి అంశం, కథాశిల్పం, కథనం చక్కగా కుదిరితే పాఠకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకుంటాయన్నారు. అనంతరం ఉపశమనం కథను వినిపించారు. రచయిత భాగవతుల సత్యనారాయణ మూర్తి 'విచిత్ర ప్రయాణం'కథానిక, చిన సూర్యనారాయణ 'తెలివి తక్కువ'కథను, సి.ఎ న్.వి.ఎస్.కృష్ణారావు, రామతాత కథలను విశ్లేషించారు.

వెనక్కి మళ్లిన సముద్రం.. తేలిన రాళ్లు



బంగ్లాదేశ్ నౌక వద్ద ఒడ్డున తేలిన రాళ్లు



తెన్నేటి పార్కు వద్ద సముద్రం లోపలకు వెళ్లడంతో తేలిన రాళ్లు

ఆరిలోవ: తెన్నేటి పార్కు, జోడుగుళ్లపాలెం ప్రాంతాలలో సముద్రం నీరు బుధవారం వెనక్కి వెళ్లింది. కెరటాలు కూడా ఒడ్డుకు కొంత దూరంలోనే ఆగిపోయాయి. దీంతో ఆయా చోట్ల లోపల ఉండే పెద్ద రాళ్లు బయటకు కనిపించాయి. నాచుపట్టిన ఆ రాళ్ల నేలపై పచ్చని తివాచీ పరిచినట్లుగా సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. ఇక్కడికి వెళ్లిన సందర్శకులు తీరంలో ఆటలాడుకోవడంతో పాటు బయటకు తేలిన రాళ్లపై నిల్చుని ఫొటోలు దిగారు. తెన్నేటి పార్కు దిగువన తీరంలో నిలిచిపోయిన బంగ్లాదేశ్ నౌక చుట్టూ ఉండే నీరు కూడా వెనక్కి వెళ్లడంతో దాని దగ్గరకు సందర్శకులు వెళ్లే అవకాశం కలిగింది. అప్పుడప్పుడు సముద్రం నీరు లోపలికి వెళ్లడంతో అలలు కొంత దూరానికే పరిమితమవుతుంటాయని మత్స్యకారులు తెలిపారు. అలాంటి సమయాల్లో ఈ విధంగా రాళ్లు పైకి కనిపిస్తాయన్నారు.

శాంతియుత సమాజానికి బౌద్ధమతం అవసరం



ఏయూ జపనీస్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో శ్రీలంక బౌద్ధ సన్యాసి అమునదోవే హేమసిరి థెరో

ఆరిలోవ: శాంతియుత సమాజానికి అవసరమైన ఆచరణాత్మకమైన సామాజిక సూత్రాలను బౌద్ధ మతం అందిస్తుందని శ్రీలంకకు చెందిన బౌద్ధ సన్యాసి అమునదోవే హేమసిరి థెరో తెలిపారు. ఏయూలో జపనీస్ ఇన్ఫర్మేషన్ అండ్ స్టడీస్ సెంటర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. సెంటర్‌లో బోధనాపరమైన అంశాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బౌద్ధ మతం అభిజ్ఞాన మానసిక సామాజిక సూత్రాలను బోధిస్తుందన్నారు. అనంతరం సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి ఈ సెంటర్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న జపనీస్ సంస్కృతి, బౌద్ధమతం సూత్రాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర, ఇతర అధికారులు

దొండపర్తి(విశాఖ దక్షిణ): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సంస్థ అధికారులు ప్రతిజ్ఞ చేశారు. వారితో పాటు సంస్థ సిబ్బందితో కూడా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర, కార్యదర్శి టి.వేణుగోపాల్, చీఫ్ ఇంజినీర్ శివ ప్రసాద్‌రాజు, ఇతర విభాగాధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



బాధితురాలికి సీఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఓ బాధితురాలికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేశారు. జీవీఎంసీ 9వ వార్డుకు చెందిన ఎన్.సత్యసాయి విటల్ కొన్నాళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరైంది. ఈ చెక్కును బుధవారం అక్కరమాని తన కార్యాలయంలో మృతుడి తల్లి వేరువాణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ స్వాతి పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతానికి పిలుపు



పిఠాపురం కాలనీ యూనియన్ బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మద్దిలపాలెం: దేశ వ్యాప్తంగా ఈ నెల 30, 31వ తేదీలలో తలపెట్టిన సమ్మెను బ్యాంకు ఉద్యోగులంతా విజయవంతం చేయాలని విశాఖ జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పిఠాపురం కాలనీలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వద్ద సంఘీభావం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పలు బ్యాంకు ఉద్యోగుల సంఘాల నాయకులు మాట్లాడుతూ వారానికి ఐదు రోజుల బ్యాంకు పని దినాలను అమలు చేయాలని, కొత్త పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగులు పెన్షన్ అప్‌డేట్ చేయాలని కోరారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించడానికి అన్ని విభాగాలలో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బి.రాంప్రకాష్, కావే శ్రీనివాసరావు, ఉదయ్‌శంకర్, విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

175 మంది మహిళలకు వైద్య పరీక్షలు



మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు రవీంద్రనగర్‌లో సేవా స్ఫూర్తి అసోసియేషన్, ధాన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మహిళల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సేవా స్ఫూర్తి భవనంలో నిర్వహించిన ఈ శిబిరంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు మహిళలకు పరీక్షలు చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు కొనసాగిన ఈ శిబిరంలో రవీంద్రనగర్, తోటగరువు, ఎస్‌ఐజీ నగర్, గాంధీనగర్, ఆదర్శనగర్ ప్రాంతాలకు చెందిన మహిళలు 175 మంది పరీక్షలు చేయించుకున్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసి అవసరమైన వారికి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సేవా స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు, ధాన్ ఫౌండేషన్ సమైక్య కో–ఆర్డినేటర్ వసంత, ఏన్సర్ ఆస్తని హెల్త్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, హెల్త్ అసోసియేట్ అయేషా, మేనేజర్ దినేష్, వైద్యులు డాక్టర్ సుభద్ర, డాక్టర్ బంతిన పాల్గొన్నారు.

జంతువులపై ప్రేమ అవసరం



మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ డీడీ కరుణాకరరావు

ఆరిలోవ: చిన్నతనం నుంచే జంతువులపై ప్రేమ చూపాల్సిన అవసరం ఉందని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కరుణాకరరావు తెలిపారు. జంతు సంక్షేమ పక్షోత్సవాలలో భాగంగా పశు సంవర్ధక శాఖ చినగదిలి వెటర్నరీ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం తోటగరువు హైస్కూల్‌లో విద్యార్థులకు జంతువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ జంతువులను హించకూడదన్నారు. వాటిని కూడా తోటి స్నేహితులు మాదిరిగా ప్రేమతో చూడాలన్నారు. జంతువులను హింసిస్తే చట్టరీత్యా నేరం చేసినవారవుతారని చెప్పారు. వేసవి కాలంలో పక్షులకు నీటిని అందుబాటులో ఉంచడం, గూళ్ల ఏర్పాటు చేయడం వంటి అలవాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి

- లోక్ అదాలత్ కార్యదర్శి కేకేవీ బులికృష్ణ

విశాఖ లీగల్ : శరవేగంతో విస్తరిస్తున్న విశాఖలో కార్మిక రంగం అంతే వేగంగా పెరుగుతోందని విశాఖ జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బులికృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవనంలో నగరంలోని వివిధ షాపింగ్ మాల్స్‌లో పనిచేస్తున్న కార్మికులు, ఇతర విభాగాల సిబ్బందితో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విశాఖలో షాపింగ్ మాల్స్, మాల్స్, బహుళ జాతి సంస్థల మాల్స్ పెరుగుతున్నాయని చెప్పారు. వీటిల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రత్యేక చట్టాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఈ – శ్రమ్ అమలులో ఉందన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు ఈ – శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు లోక్ అదాలత్‌లో ప్రత్యేక విభాగం ఉందన్నారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ మోహన్ లక్ష్మి మాట్లాడుతూ ప్రతి కార్మికుని కుటుంబానికి భద్రత అవసరమన్నారు. నగరంలోని వివిధ మాల్స్‌లో పనిచేస్తున్న కార్మికులు తమ వివరాలను కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

వైభవంగా ముత్యాలమ్మ పరస

- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- నక్కవానిపాలెంలో జాతర సందడి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



జాతరలో విద్యుద్దీపాలంకరణ, స్టాల్స్ వద్ద సందడి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో ముత్యాలమ్మ వారి పరస మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి , కేశవరెడ్డి దంపతులు, గిడ్డంగుల మాజీ చైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి, కాయల సూరారెడ్డి దర్శించుకుని, పూజలు చేశారు. ఉత్సవాల్లో సాము గరిడీ, భజనతో పాటు విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. గ్రామ కమిటీ పరస రోజు అమ్మవారికి పసుపు, కుంకుమ, ఫలం, పుష్పాలు సమర్పించింది. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు డి.వి.ఎస్.ప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ దిలీప్‌కుమార్.రెడ్డి, కోశాధికారి రాజా, శ్యామ్‌కుమార్, కండ్రపు వేణు, దల్లి రామకృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి, ఆలయ ధర్మకర్త ఎరుసు నర్సింగరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బిల్లు లేని పాత మొబైల్ ఫోన్లు కొంటే శిక్షార్హులు



సమావేశంలో పాల్గొన్న సెకండ్ హ్యాండ్ మొబైల్ దుకాణాల యజమానులు

అల్లిపురం: బిల్లులు లేని సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొంటే శిక్షార్హులవుతారని నగర క్రైం డీసీపీ నాగన్న పాత మొబైల్ కొనుగోలు దుకాణదారులను హెచ్చరించారు. డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బుధవారం సాయంత్రం సెకండ్ హ్యాండ్ మొబైల్ దుకాణదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు ఎవరి దగ్గరికైనా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు అమ్మకానికి తీసుకువచ్చిన వారిపై అనుమానం ఉన్నట్లయితే తక్షణమే సంబంధిత పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. అలా కాని ఎడల దుకాణదారులే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. నగరంలో సుమారు వంద వరకు సెకండ్ హ్యాండ్ మొబైల్ షాపులు ఉన్నాయన్నారు. వారందరు పోలీసుల సూచనలను కచ్చితంగా పాటించాలన్నారు. నిందితులను పట్టుకోవడంలో పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ యర్రంనాయుడు, సీసీఎస్ సీఐ సత్యనారాయణ, రమేష్, టూటౌన్ క్రైం ఎస్‌ఐ కె.శ్రీనివాస్, సెకండ్ హ్యాండ్ మొబైల్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

- ఇష్టంలేని పెళ్లి కుదర్చడమే కారణం

సింహాచలం: ఇష్టంలేని పెళ్లి కుదిర్చారని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెందుర్తి నుంచి పులగానిపాలెం వెళ్లే మార్గంలోని ఎంఎస్‌రామయ్య అపార్ట్‌మెంట్‌లో చోటుచేసుకుంది. గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు తెలిపిన వివరాలు ... ఎంఎస్ రామయ్య అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సౌజన్య(25) హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేస్తోంది. ప్రస్తుతం వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తోంది. తల్లిదండ్రులు ఇష్టం లేని పెళ్లి కుదర్చడంతో మంగళవారం ఉదయం 11గంటల సమయంలో ఇంట్లోని తన గదిలోకి వెళ్లి తలుపువేసుకుంది. అయితే శిరీష తరచూ అలిగి తలుపులు వేసుకోవడం, భోజనానికి పిలిచినా రాకపోవడం వంటి అలవాటు ఉంది. ఈ తరుణంలోనే రాత్రి వరకు గదిలో నుంచి బయటికి రాకపోయినా తల్లిదండ్రులు పట్టించుకోకుండా పడుకున్నారు. బుధవారం తెల్లవారుజామున కూడా శిరీష బయటికు రాకపోవడంతో అనుమానం వచ్చి చూడగా ఉరివేసుకుని ఉంది. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యకారులకు సీపీ పలకరింపు



జోడుగుళ్లపాలెం వద్ద మత్స్యకారులతో మాట్లాడుతున్న సీపీ శ్రీకాంత్

ఆరిలోవ: జోడుగుళ్లపాలెం తీరంలో సాక్షి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నిర్వహించిన బీచ్ క్లీనింగ్‌లో భాగంగా నగర సీపీ శ్రీకాంత్ ఇక్కడ తీరం వద్ద ఉన్న మత్స్యకారులను పలకరించారు. తీరంలో రక్షణ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. ఇటీవల జీవీఎంసీ నియమించిన లైఫ్ గార్డుల పనితీరు, చేస్తున్న సేవలపై ఆరా తీశారు. ఏయే సమయాల్లో అలలు ఉధృతంగా ఉంటాయి.. అలాంటి సమయాల్లో ఏవిధంగా జాగ్రతలు పాటిస్తారు.. తదితర అంశాల గురించి ప్రశ్నించారు. సీపీ నేరుగా తమ వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకోవడంతో స్థానిక మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ విజేతలకు అభినందన



స్కేటింగ్‌లో పతకాలు సాధించిన బాలికలను అభినందిస్తున్న సీతారాం

మద్దిలపాలెం: రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో నగరానికి చెందిన పొందల సహిర, పి.సమీక్షలు బంగారు, రజిత, పతకాలు సాధించారు. ఈ మేరకు విజేతలకు మద్దిలపాలెంలోని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయంలో బుధవారం సభ్యుడు గొండు సీతారాం శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 నుంచి సహీరా జిల్లా, జాతీయ స్థాయిలో పాల్గొన్ని ఇప్పటి వరకూ 61 బంగారు, రజిత, కాంస్య పతకాలను సాధించడం అభినందనీయన్నారు. పి.సమీక్ష కూడా 2016 నుంచి జిల్లా, జాతీయ స్థాయి పోటీలలో 57 పతకాలు సాధించిందన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. వీరికి శిక్షణ ఇస్తున్న ట్రైనర్లు శీలం లక్ష్మణ్, సిహెచ్.సింహాద్రిలను కూడా సీతారాం అభినందించారు.

లేపాక్షి రెండో ఎంపోరియం ఏర్పాటుకు వినతి



మేయర్‌కు వినతి పత్రం అందిస్తున్న లేపాక్షి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

ఆరిలోవ: మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని పెదగదిలిలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె నగరంలో లేపాక్షి రెండో ఎంపోరియం ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరుతూ మేయర్‌కు వినతి పత్రం అందజేశారు. భీమిలి ప్రాంతంలో రెండో ఎంపోరియం ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం గానీ, వ్యాపార సముదాయ భవనం గానీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ప్రతిపాదనకు మేయర్ సానుకూలంగా స్పందించినట్టు విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, లేపాక్షి విశాఖ మేనేజర్ విజయగౌరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

ఆచార్య సచ్చిదానందమూర్తి సేవలు నిరుపమానం



సచ్చిదానందమూర్తి విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: ప్రముఖ తత్వవేత్త, యూజీసీ మాజీ ఉపాధ్యక్షుడు కొత్త సచ్చిదానందమూర్తి 12వ వర్ధంతి కార్యక్రమం ఆంధ్ర విశ్వవిద్యాలయం తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి ఆచార్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ, కొత్త సచ్చిదానందమూర్తి, ప్రొఫెసర్ పి.టి.రాజు వంటి ప్రపంచ స్థాయి తత్వవేత్తలను ఏయూ తత్వశాస్త్ర విభాగం అందించిందన్నారు. ఆచార్య వి.కృష్ణయ్య మాట్లాడుతూ విభాగానికి సచ్చిదానందమూర్తి చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాస్త్ర విభాగ అధిపతి ఆచార్య వి.వెంకట్రావు, పరిశోధకులు ఆచార్య కె.ఆర్.రజిని, వీరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయం మోడల్ కెరీర్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. సినర్జీస్ కాస్టింగ్, వరుణ్ మోటార్స్, లక్ష్మీ కియా మోటార్స్, లక్ష్మీ హ్యుందాయ్ మోటార్స్, మ్యాంగో మోటార్స్, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ కంపెనీల్లో 221 ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ట్రైనీ, పెయింటర్స్, టెక్నీషియన్, సేల్స్, కన్సల్టెంట్, టెలీ కాలర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్, తదితర ఉద్యోగాలకు సుమారు 289 మంది అభ్యర్థులు హాజరైనట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(క్లరికల్) సిహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు. వీరిలో 64 మంది అభ్యర్థులు ఆయా కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని, వారికి నియామక పత్రాలు అందజేశామని చెప్పారు. అనంతరం అభ్యర్థులతో జాతీయ ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు.